సాక్షి మంచిర్యాల

గురువారం । 6 । మార్చి । 2025



పక్షుల లెక్క తేలింది

జన్నారం అటవీ డివిజన్‌లో పక్షుల లెక్క తేలింది. అటవీశాఖ, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టి 201రకాల పక్షులు ఉన్నట్లు గుర్తించారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు : 6:20	శుక్ర: 5:14

గరిష్టం/కనిష్టం 35.0 /17.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

శాంతిఖని ఇక లాంగ్‌వాల్



శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్టు బోర్డు

- నేడు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ
- మారనున్న భూగర్భ గని స్వరూపం

బెల్లంపల్లి: మందమర్రి ఏరియా శాంతిఖని లాంగ్‌వాల్ భూగర్భ గని ప్రాజెక్టు కోసం గురువారం ఉదయం 11గంటలకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఆకెనపల్లి గ్రామ పంచాయతీ పరిధి శాంతిఖని పాత మైన్ కార్యాలయం ఆవరణలో ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయం, మంచిర్యాల జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ప్రజాభిప్రాయం సేకరిస్తారు. ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి చేస్తున్న శాంతిఖని భూగర్భ గని పునఃధ్రువీకరణ కోసం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ(ఎంవోఈఎఫ్, సీసీ) 2018 ఏప్రిల్ 6న పర్యావరణ అనుమతుల కోసం జారీ చేసిన సూచనల నియామవళిలో ప్రతిపాదించిన మార్పులకు అనుగుణంగా మరోమారు ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధమయ్యారు. 2006లో ఎంఓఈఎఫ్, సీసీ పర్యావరణ అనుమతి(ఈసీ)ని మంజూరు చేసింది. ఆ ప్రకారంగా 681.23 హెక్టార్ల ప్రాజెక్టు ప్రాంతంలో సాలీనా 1,167 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో గనిని నిర్వహించాలని ప్రతిపాదించారు.

కొత్తగా భూ సేకరణ అవసరం లేకుండానే..

1954లో అంకురార్పణ జరిగిన శాంతిఖని భూగర్భ గనిలో మూడేళ్ల ఎడబాటు తర్వాత 1957లో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత ప్రారంభమైంది. ఈ గని ప్రారంభమై 71ఏళ్లు కావస్తోంది. ఇంకా ఈ గని భూగర్భంలో మరి కొన్నేళ్లపాటు తవ్వకాలు జరిపినా తరగని బొగ్గు నిక్షేపాలు ఉన్నాయి. తాజాగా పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో గని కార్యకలాపాల నిర్వహణ కోసం అదనంగా భూమి సేకరించాల్సిన అవసరం లేదని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేస్తుండగా.. గని భూగర్భంలో ప్రస్తుతం 500 మీటర్ల దిగువలో బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. ఈ గనిని ఓపెన్‌కాస్ట్ గనిగా మార్చే ప్రతిపాదనలు ఏమీ లేవని, భూగర్భ భౌగోళిక స్థితిగతుల రీత్యా ఓపెన్‌కాస్ట్ గనిగా మార్చే వీలు ఏ కోశాన లేదని యాజమాన్యం స్పష్టం చేస్తోంది. సమీప భవిష్యత్‌లో గనిలో 500 మీటర్ల నుంచి 700 మీటర్ల లోతు వరకు బొగ్గు వెలికితీతకు అవకాశాలు ఉన్నాయి. ఇందుకు గాను శాంతిఖని గనిని లాంగ్‌వాల్ ప్రాజెక్టుగా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ప్రాజెక్టు స్వరూపం

భూగర్భ గనిగా శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్టు చేపడుతారు. ప్రాజెక్టు విస్తీర్ణం 681.23 హెక్టార్లు కాగా.. ఇందులో అటవీ భూమి 484.94హెక్టార్లు, అటవీయేతర భూమి 196.29 హెక్టార్లు ఉంది. గని జీవిత కాలం ఎనిమిదేళ్లు కాగా.. బోర్డు, ఫిల్లింగ్ మైనింగ్ పద్ధతిలో మైనింగ్ చేస్తారు. లాంగ్‌వాల్, రోడ్ హెడర్, కంటిన్యూయస్ మైనర్ సాంకేతికతను వినియోగిస్తారు. మూలధన నిధులు రూ.307.840 కోట్లు కాగా.. పర్యావరణ పరిరక్షణకు రూ.50లక్షలు(మూల ధన నిధులు), రెవెన్యూ నిధులు సాలీనా రూ.39లక్షలు ఖర్చు చేస్తారు. గనిలో ఎనిమిది పొరలుగా బొగ్గు ఉన్నట్లు గుర్తించారు. ఎస్‌జే టాప్ సెక్షన్, ఎస్‌జే బాటమ్ సెక్షన్ పొరలుగా బొగ్గు వెలికి తీస్తారు.

నిల్వలు..

జియోలాజికల్ నిల్వలు 48.872 మిలియన్ టన్నులు ఉండగా.. వెలికితీయదగిన నిల్వలు 30.93 మిలియన్ టన్నులు, భూగర్భ గని ద్వారా తీయగలిగే నిల్వలు 17.775 మిలియన్ టన్నులు ఉన్నాయి. 2023 మార్చి 31వరకు 9.01మిలియన్ టన్నులు బొగ్గు వెలికితీయగా.. 2023 ఏప్రిల్ 1నాటికి 8.765 మిలియన్ టన్నుల నిల్వలు ఉన్నాయని, బొగ్గు సగటు గ్రేడ్ జీ–9గా గుర్తించారు.

ప్రభావిత గ్రామాల ప్రజల్లో భయాందోళనలు

ప్రతిపాదిత శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్టు పరిసరాల్లో పలు గ్రామాలు ప్రభావితమయ్యే అవకాశాలు ఉన్నాయి. తరాల నుంచి ఆయా గ్రామాల ప్రజలు సాగు భూములను నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం తలపెట్టిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణతో సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతునాయి. గని ప్రభావిత గ్రామాలుగా ఆకెనపల్లి, లింగాపూర్, పాతబెల్లంపల్లి, గురిజాల, పెర్కపల్లి గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజల్లో నెలకొన్న సందేహాలు, అనుమానాలను నివృత్తి చేసి పునఃధ్రువీకరణ అంశంపై స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, సింగరేణి యాజమాన్యంపై ఉంది. ఇప్పటికే గ్రామాల్లో శాంతిఖని గని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు కాబోతోందనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో పర్యావరణ అనుమతి కోసం జరిగే ప్రజాభిప్రాయ సేకరణకు ప్రభావిత గ్రామాల ప్రజలు, కార్మిక, రాజకీయపక్షాల శ్రేణులు, సామాజిక కార్యకర్తలు హాజరై అభిప్రాయాలను వెల్లడించడానికి సిద్ధమయ్యారు.

అరకొరగా పౌష్టికాహారం

- అంగన్‌వాడీ కేంద్రాలకు సరకుల సరఫరాలో జాప్యం
- గత నెల నుంచి రాని కందిపప్పు
- చిన్నారుల్లో పౌష్టికాహార లోపం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు(ఫైల్)

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాల్సి ఉండగా.. అందుకు అవసరమైన సరుకుల సరఫరాలో ప్రతీనెల జాప్యం జరుగుతోంది. దీంతో పిల్లల ఎదుగుదల, పోషకాహార లోపానికి గురయ్యే అవకాశం ఉంది. మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతినెలా అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం, కందిపప్పు, కోడిగుడ్లు, పాలు, బాలామృతం, స్నాక్స్ అందించాల్సి ఉంది. ఇందుకోసం రాష్ట్ర స్థాయిలో టెండర్లు నిర్వహిస్తున్నారు. ప్రతీ నెల లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాల్సి ఉండగా.. ఒక్కో నెలలో కేంద్రాలకు సరఫరా కావడం లేదు. గత నెలలో కందిపప్పు సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారులకు అందించలేదు. రేషన్ బియ్యం గోదాముల నుంచి నేరుగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సి ఉండగా.. గత నెలలో కొన్ని కేంద్రాలకు బియ్యం కూడా సరఫరా చేయలేదు. దీంతో లబ్ధిదారులకు పౌష్టికాహారం అందకుండా పోతోంది. కేంద్రాల్లో ప్రతీ రోజు మధ్యాహ్నం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన భోజనం పెట్టాల్సి ఉంటుంది. గత నెల నుంచి పప్పు సరఫరా కాకపోవడంతో కూరగాయల భోజనం పెట్టాలన్నా టమాటా మినహా మిగతా వాటి ధరలు అధికంగా ఉండడం టీచర్లకు భారంగా మారుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిల్వ ఉన్న పప్పు కూడా అయిపోవడంతో అధిక ధరకు కూరగాయలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. మాతాశిశు మరణాల నివారణకు సరైన పౌష్టికాహారం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. గతంలో జిల్లాలోనే పాలు, పప్పు టెండర్లు నిర్వహించి సరఫరా చేసేవారు. కొన్నేళ్లుగా రాష్ట్ర స్థాయిలోనే టెండర్లు నిర్వహించి సరఫరా చేస్తున్నారు. ప్రతియేటా ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో సరుకుల సరఫరాకు టెండర్లు నిర్వహిస్తుండగా.. ఆర్థిక సంవత్సరం ముగింపునకు చేరడంతో టెండర్ ప్రక్రియ ఆలస్యమైతే సరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది. కొన్ని కేంద్రాలకు చిన్న కోడిగుడ్లు సరఫరా చేయడంతో లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో పోషకాలు అందడం లేదు.

నెల నెల సరఫరా చేస్తేనే..

జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆరేళ్లలోపు చిన్నారులు 45,455 మంది, 4,245 మంది గర్భిణులు, 3,186 మంది బాలింతలు ప్రతీరోజు మధ్యాహ్నం పౌష్టికాహారం తీసుకుంటున్నారు. ఆరోగ్యలక్ష్మి పథకం కింద గర్భిణులు, బాలింతలకు మధ్యాహ్నం భోజనం, బాలింతలకు 200 మిల్లీలీటర్ల పాలు అందిస్తున్నారు. ఎక్కువగా పప్పు, ఆకుకూరలతో భోజనం వడ్డిస్తున్నారు. కోడిగుడ్లు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం వాటిపై 'అంగన్‌వాడీ గుడ్డు–తెలంగాణ ప్రభుత్వం' అనే ముద్ర వేస్తోంది. మొదటి విడతలో నీలం రంగు, రెండో విడత ఎరుపు రంగు, మూడో విడతలో ఆకుపచ్చ రంగుతో ముద్ర వేసి సరఫరా చేస్తున్నారు. ముద్రల వల్ల కోడిగుడ్ల పంపిణీ జరిగిందో లేదో తెలుసుకునే అవకాశం ఉంది. కానీ మూడు విడతల గుడ్లను నెలలో ఒక్కసారే ఇస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కోడిగుడ్లు, పాలు, కందిపప్పు, బాలామృతం ప్రతినెలా ఆయా కేంద్రాలకు సరిపడా సరఫరా చేస్తే లబ్ధిదారులకు సకాలంలో అంది పౌష్టికాహారంతో కూడిన ఆహారం పొందే వీలుంది.

సరఫరాకు ఇబ్బంది లేదు



అన్ని కేంద్రాలకు కందిపప్పును రెండు నెలలకు ఒకసారి ఇస్తున్నారు. రేషన్ బియ్యం నేరుగా గోదాముల నుంచి సరఫరా అవుతున్నాయి. కొందరు టీచర్లు కందిపప్పు స్టాక్ ఉందని చెబితే ఆయా కేంద్రాల్లో వేయడం లేదని తెలిసింది. లబ్ధిదారులకు ప్రతినెలా సరిపడా సరుకులు కేంద్రానికి చేరేలా టీచర్లు చూడాలని, ఎక్కడైనా సరుకులు రాని పక్షంలో సూపర్‌వైజర్లు, సీడీపీవోలకు తెలపాలని చెబుతున్నాం. కొన్ని కేంద్రాల్లోనే సమస్య ఉన్నట్లు తెలిసింది. లబ్ధిదారులకు సరిపడేలా సరుకులను అందించేలా చూస్తాం. పౌష్టికాహారం సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేదు.

– రౌఫ్‌ఖాన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి

న్యూస్‌రీల్

బాలికల వసతిగృహంలో బీసీ వెల్ఫేర్ అధికారి బస



నిద్రిస్తున్న భాగ్యవతి, విద్యార్థినులు

జైపూర్: మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతిగృహంలో మంగళవారం రాత్రి జిల్లా బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్ అధికారి భాగ్యవతి బస చేశారు. విద్యార్థులకు స్వయంగా భోజనాన్ని వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. వసతిగృహ పరిసరాలు, మరుగుదొడ్లు పరిశీలించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన కల్పించారు. ఒత్తిడికి గురికావద్దని, ప్రశాంతతో చదవాలని, ముఖ్యమైన విషయాలను నోట్స్ రూపంలో రాసుకుని ఎక్కువగా రివిజన్ చేస్తే ఉత్తీర్ణతతోపాటు మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ వసతిగృహ సంక్షేమాధికారి సుధాలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాజీపేట-బల్లార్షా ఎక్స్‌ప్రెస్ రైలు పునరుద్ధరణ

బెల్లంపల్లి: కరోనా నేపథ్యంలో అర్ధంతరంగా రద్దు చేసిన కాజీపేట-బల్లార్షా ప్యాసింజర్ రైలును ఎట్టకేలకు పునరుద్ధరించారు. గురువారం కాజీపేట నుంచి బల్లార్షాకు, శుక్రవారం బల్లార్షా నుంచి కాజీపేటకు బయల్దేరుతుంది. గతంలో మాదిరి ప్యాసింజర్ రైలుగా కాకుండా ఎక్స్‌ప్రెస్ రైలుగా ప్రయాణికులకు సేవలందించనుంది. సుమారు రెండేళ్లకు పైగా రాకపోకలు నిలిచిపోయిన రైలు నడపడానికి దక్షిణ మధ్య రైల్వే అధికారులు పచ్చజెండా ఊపడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కరోనాకు ముందు ఈ రైలు కాజీపేట నుంచి అజ్నీ వరకు ప్యాసింజర్ రైలుగా నడిచేది. కొన్ని రోజుల తర్వాత బల్లార్షాకు పరిమితం చేశారు. అనాలోచిత నిర్ణయంతో పూర్తిగా రద్దు చేయడంపై అప్పట్లో విమర్శలొచ్చాయి. ఈ రైలును 2022జూన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలుగా పునరుద్ధరించారు. 2023 నవంబర్ నుంచి పదిహేను రోజులకోసారి ఉత్తర్వులు జారీ చేస్తూ దాదాపు 16నెలలపాటు రోలింగ్ కారిడార్ బ్లాక్ పనుల కారణంగా రద్దు చేశారు. దీంతో రైల్వే ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా పునరుద్ధరణకు ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం సభ్యులు ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు దక్షిణ మధ్య రైల్వే అధికారులకు వినతులు పంపించారు. ఫోరం సభ్యుల కృషి ఫలించి రైలు పునరుద్ధరణకు నోచుకుంది. రైలు బల్లార్షా నుంచి కాజీపేట్ జంక్షన్‌కు వెళ్లాక దాదాపు 14 గంటలపాటు ఖాళీగా ఉంటుంది. రైలు వేళలు మార్చి చర్లపల్లి టెర్మినల్ వరకు పొడగిస్తే హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులకు ఉపయుక్తంగా ఉంటుందని ఫోరం ప్రతినిధులు, ప్రయాణికులు కోరుతున్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేయొద్దు



స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయవద్దని, చేసినట్లు రుజువైతే చట్ట ప్రకారంగా చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ హెచ్చరించారు. జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల తనిఖీలను బుధవారం ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని బాలాజీ స్కానింగ్ కేంద్రాన్ని డీఎంహెచ్‌వో పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కృపాబాయి, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి



పాఠశాలను పరిశీలిస్తున్న డీఈవో

లక్సెట్టిపేట: విద్యార్థుల ఉత్తమ ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. బుధవారం మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించి మాట్లాడారు. పదవ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. హెచ్‌ఎం యశోధర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మంచిర్యాలలో విద్యార్థినుల తనిఖీ



విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసు, సిబ్బంది



జైపూర్ పరీక్ష కేంద్రం వద్ద కలెక్టర్ కుమార్ దీపక్

ఇంటర్ పరీక్షలు షురూ

- ఒక్క నిమిషం సడలింపుతో ఊరట
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఐఈవో

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. నిమిషం నిబంధనను సడలిస్తూ ఐదు నిమిషాలకు పెంచడం విద్యార్థులకు ఊరట కలిగించింది. పరీక్ష నిర్దేశిత సమయం కంటే మూడు, నాలుగు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులనూ అనుమతించారు. కుటుంబసభ్యులతో కలిసి పరీక్ష సమయానికి ముందే వచ్చిన కొందరు నోటీసు బోర్డులో గది నంబరు తాపీగా చూసుకున్నారు. ఈ నెల 22 వరకు జరిగే పరీక్షల కోసం 23 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం 6365 మంది విద్యార్థులకు గాను 6078 మంది హాజరు కాగా 287 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 5697 మందికి 5497 మంది పరీక్ష రాయగా.. 225 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 668 మందికి 606 మంది హాజరు కాగా 62 మంది రాలేదు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కేంద్రాల్లోకి అనుమతించారు. చేతిగడియారాలు, పరీక్ష ప్యాడ్‌లపై చిన్నగా రాసినట్లు ఉన్నా అనుమతించలేదు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను డీఐఈవో అంజయ్య పరిశీలించారు.

పకడ్బందీగా నిర్వహించాలి

జైపూర్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలను అవకతవకలకు తావులేకుండా లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని బుధవారం ఆయన జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, తహసీల్దార్ వనజారెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్, తాగునీరు, ఫ్యాన్లు, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై చర్యలు

- 10 నుంచి ప్రజావాణి ప్రారంభం
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, పక్కన డీసీపీ భాస్కర్

నస్పూర్: ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో బుధవారం ఆయన అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీలు, తహసీల్దార్లు, సీఐలు, ఎస్సైలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమం ఈ నెల 10న తిరిగి ప్రారంభం అవుతుందని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులపై పోలీస్, రెవెన్యు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దరఖాస్తులు స్వీకరించిన తర్వాత కనీసం 15 రోజులు, గరిష్ఠంగా 21రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. కోర్టులో పరిష్కారమయ్యే సమస్యలపై అర్జీదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బెదిరింపులు, ఆందోళనలు చేపట్టే వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఆక్రమిత ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు ప్రకాశ్, వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు, సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారితో కలెక్టర్ భేటీ

శ్రీరాంపూర్: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణికుముదిని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు వచ్చిన ఆమెను సీసీసీలోని సింగరేణి గెస్టుహౌజ్‌లో బుధవారం కలిసి పూల మొక్కను అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సరళిపై చర్చించినట్లు తెలిసింది.

పట్టభద్రుల సీటూ కమలానిదే!

- గ్రాడ్యుయేట్‌లోనూ బీజేపీ హవా
- అధిక ఓట్లతో గెలిచిన అంజిరెడ్డి
- మూడు రోజులు సాగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- ముగ్గురికే 92.52శాతం ఓట్లు



కౌంటింగ్ కేంద్రంలో అభ్యర్థులు, ఎన్నికల అధికారి



సంబరాల్లో కేంద్రమంత్రి బండి సంజయ్, అంజిరెడ్డి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి: కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్–మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించారు. మూడు రోజులపాటు ఉత్కంఠగా సాగిన ఓట్ల లెక్కింపులో ఎలిమినేషన్ రౌండ్లతో బీజేపీ గెలుపు ఖరారైంది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత కూడా గెలుపునకు సరిపడా కోటా ఓట్లు రాకపోయినా అంజిరెడ్డికి అత్యధిక ఓట్లు రావడంతో ఆయననే విజేతగా ప్రకటించారు. చివరి వరకు హోరాహోరీగా పోరాడిన కాంగ్రెస్ అభ్యర్థి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించడంతో శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు.

సుదీర్ఘంగా సాగిన కౌంటింగ్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఫిబ్రవరి 27న జరగ్గా, మార్చి 3న కౌంటింగ్ ప్రారంభించారు. మూడు రోజులపాటు నిర్విరామంగా మూడు షిఫ్టుల్లో 800మంది కౌంటింగ్ సిబ్బంది కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో 21 టేబుళ్లపై లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. సోమవారం ఉదయం 8గంటలకు కౌంటింగ్ ప్రారంభించిన అధికారులు, మంగళవారం మధ్యాహ్నం వరకు చెల్లని ఓట్లను వడపోసి, కట్టలు కట్టారు. మంగళవారం రాత్రి నుంచి మొదటి ప్రాధాన్యత ఓట్లను లెక్కింపు చేపట్టి బుధవారం ఉదయం 8.30గంటల నుంచి ఎలిమినేషన్ రౌండ్లను ప్రారంభించారు. ఎలిమినేషన్ రౌండ్లలో బరిలో ఉన్న 54మందిలో తక్కువ ఓట్లు కలిగి ఉన్న వారిని ఒక్కొక్కరిగా తొలగిస్తూ, వారికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను మిగతా అభ్యర్థులకు పంచుతూ కౌంటింగ్ ప్రక్రియను మూడు రోజుల పాటు సుదీర్ఘంగా కొనసాగించారు.

ముగ్గురికే 92.52శాతం ఓట్లు

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 56మంది అభ్యర్థులు నిలిచారు. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్యర్థుల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. చెల్లుబాటైన ఓట్లలో 92.52శాతం(2,06,659) మొదటి ప్రాధాన్యత ఓట్లు ఈ ముగ్గురికే వచ్చాయి. మిగతా 53మంది స్వతంత్ర అభ్యర్థులు 16,684 ఓట్లు మాత్రమే సాధించారు.

రెండో ప్రాధాన్యత ఓట్లలో బీజేపీదే హవా

నిర్ధారిత కోటా ఓట్లు కోసం అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టగా బీజేపీ అభ్యర్థి ఆధిక్యం చూపారు. తొలుత 53మందిని ఎలిమినేషన్ చేసి రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించగా బీజేపీకి 78,635 ఓట్లు, కాంగ్రెస్‌కు 73,644 ఓట్లు, బీఎస్పీకి 63,972 ఓట్లు వచ్చాయి. 53మందిని ఎలిమినేషన్ చేసినా.. కోటా ఓట్లను ఎవరు సాధించకపోవడంతో మూడో స్థానంలోని బీఎస్పీ అభ్యర్థి ప్రసన్నహరి కృష్ణను ఎలిమినేట్ చేశారు. అతనికి వచ్చిన ఓట్లలో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. దీంతో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రసన్న హరికృష్ణను ఎలిమినేషన్ చేసిన అనంతరం బీజేపీ అభ్యర్థికి 98,637ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థికి 93,531 ఓట్లు వచ్చాయి. మొత్తంగా కాంగ్రెస్ అభ్యర్థి కన్నా 5,106ఓట్ల ఆధిక్యంలో ఉండటంతో బీజేపీ అభ్యర్థిని విజయం వరించింది. చివరకు బీఎస్పీ అభ్యర్థికి పోలైన ఓట్లలో చాలామంది రెండో ప్రాధాన్యత ఓటును బీజేపీకే వేయడంతో విజయం దక్కింది.

మూడో యూనిట్ పనులకు సిద్ధంగా ఉండాలి



ప్లాంటు నిర్మాణ స్థలం, పైలాన్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు విస్తరణలో భాగంగా మూడో యూనిట్(800 మెగా వాట్లు) ప్లాంటు నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉండాలని సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) డి.సత్యనారాయణరావు అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటును సందర్శించారు. ప్లాంటు నిర్మాణ స్థలం పరిశీలించి పైలాన్ నిర్మాణంపై అధికారులతో చర్చించారు. 1200మెగావాట్ల బీటీజీ ఏరియాలో బాయిలర్స్ పరిశీలించి విద్యుత్ ఉత్పత్తి, ఉత్పాదకతను గమనించి ప్లాంటు నిర్వహణలో లోపాలు లేకుండా నిరంతరం విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. సాయంత్రం ఎస్టీపీపీ ఓపెన్ ఆడిటోరియంలో ఇటీవల ఫైనాన్స్ జీఎంగా పని చేసి పదవీ విరమణ పొందిన టి.సుధాకర్‌ను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఈడీ శ్రీనివాసులు, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏజీఎంలు ప్రసాద్, వేణుగోపాలరావు, సీఎంవోఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు, సముద్రాల శ్రీనివాస్, ఫారెస్ట్ మేనేజర్ చంద్రమణి, తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలను వినియోగించుకోవాలి

శ్రీరాంపూర్: యంత్రాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) డీ.సత్యనారాయణరావు తెలిపారు. బుధవారం ఆయన శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఓసీపీల్లో ఉత్పత్తి పెరుగాలంటే యంత్రాల పనిగంటలు పెంచుకోవాలని తెలిపారు. అనంతరం కోల్ ఎన్‌క్లోజర్ ప్రదేశాలను ప్రత్యక్షంగా పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జీఎం(సీహెచ్‌పీఎస్) తిరుమల్‌రావు, ఏరియా ఎస్ఓటు జీఎం యస్.సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఓసీపీ పీఓ టీ.శ్రీనివాస్, డీజీఎంలు కేశవరావు, రవీందర్, క్వాలిటీ మేనేజర్ కే.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్ నాగరాజు, గని మేనేజర్ బ్రహ్మాజీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒకే ఈతలో రెండు లేగదూడలు


లేగదూడలతో మారయ్య

నెన్నెల: మండలంలోని జెండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన బోర్లకుంట మారయ్య పెంచుకుంటున్న ఆవు బుధవారం సాయంత్రం ఒకే ఈతలో రెండు లేగదూడలకు జన్మనిచ్చింది. దీంతో రైతు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఒకే ఈతలో రెండు దూడలు జన్మించడం చాలా అరుదుగా జరుగుతుందని పశువైద్యాధికారి చేతన్ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లి, ఎదుల బంధం గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ హరి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బుధవారం ఆయా గ్రామాల్లో దాడులు నిర్వహించి 24 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ఎనిమిది మంది అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్

చెన్నూర్: మండలంలోని కిష్టంపేట శివారులో గంజాయి సేవిస్తున్న పలువురిని అరెస్టు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. పోలీసు స్టేషన్‌లో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కిష్టంపేట జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న పదిమంది యువకులను పట్టుకుని విచారించగా గంజాయి సేవిస్తున్నట్లు ఒప్పుకున్నారన్నారు. వారి వద్ద 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో ఒకరు మైనర్‌కాగా మరొకరు పరారయ్యారన్నారు. సమావేశంలో ఎస్సై సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పక్షుల లెక్క తేలింది

- జన్నారం డివిజన్‌లో 201 రకాలు గుర్తింపు
- అటవీశాఖ, వరల్డ్‌వైడ్ లైఫ్‌ఫండ్ ఆధ్వర్యంలో సర్వే


జన్నారం డివిజన్‌లో కనిపించిన లెస్సర్ విస్లింగ్ డక్స్

జన్నారం(ఖానాపూర్): పక్షుల గమనానికి పరిధిలు లేవు. అవి ఖండాలు దాటి ప్రయాణిస్తూ పర్యావరణంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. పర్యావరణంలో జరిగే పెను మార్పుల వల్ల కొన్ని జాతుల పక్షులు వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి వలస వెళ్తుంటాయి. ఇలాంటి పక్షులను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పక్షులు ఎంతో జీవవైవిధ్యం ప్రదర్శిస్తూ మానవాళి మనుగడకు, పర్యావరణానికి ఎంతో మేలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా పక్షుల వివరాలను తెలుసుకునేందుకు అటవీశాఖ, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సంస్థలు సంయుక్తంగా సర్వే నిర్వహించాయి. ఈ ఏడాది జనవరి 24 నుంచి 26 వరకు జంతుగణన మాదిరి కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో పక్షుల గణన చేశారు. 28 మంది సభ్యులు ఏడు బృందాలుగా ఏర్పడి డివిజన్‌లోని 40 అటవీ బీట్‌లలో సర్వే చేశారు. డివిజన్‌లో సంచరిస్తున్న పక్షుల వివరాలను సేకరించారు. వీటితో పాటుగా అంతరించిపోయే దశలో ఎన్నిరకాల పక్షులు ఉన్నాయి? ఏఏ కేటగిరీలో ఏ పక్షులున్నాయో సర్వేలో తేలినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

201 రకాల పక్షులు

జన్నారం అటవీ డివిజన్‌లో నిర్వహించిన సర్వేలో 201 రకాల పక్షులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అటవీశాఖ, వరల్డ్ వైడ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సంస్థ ఆధ్వర్యంలో పక్షులపై సమగ్ర పరిశీలన చేశారు. 11 రకాల పక్షి జాతులు అంతరించి పోయే దశలో ఉన్నాయని, 57 రకాల పక్షులు కేవలం అటవీ, ప్లాంటేషన్ ఏరియాలో సంచరిస్తున్నాయని, మన పరిసరాల్లో తిరిగే పక్షులు 18, కీటకాలు తినే పక్షులు 99 రకాలు, కేవలం పండ్లను మాత్రమే తినే పక్షులు 16 రకాలు ఉన్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు.

పక్షులపై అవగాహన

ప్రస్తుత రోజుల్లో పక్షుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విద్యార్థి దశ నుంచే దీనిని ఒక హాబీగా పెట్టుకోవాలనే ఉద్దేశంతో పక్షులు, వాటి సంరక్షణపై అవగాహన కల్పించేందుకు అటవీశాఖ నిర్ణయం తీసుకోనుంది. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే సైన్స్ టీచర్లను అడవుల్లోకి తీసుకెళ్లి బర్డ్‌వాక్ కార్యక్రమం చేపట్టనున్నారు. వీటితో పాటుగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సంస్థ ప్రతినిధులతో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలు పాఠశాలల్లోని విద్యార్థులకు వివరించనున్నారు. ఈ విషయంపై అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. పక్షుల సంరక్షణపై, పక్షులు అంతరిస్తే కలిగే నష్టాలు, జీవ వైవిధ్యంలో పక్షుల పాత్ర, తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నారు.

ప్రతీ ఆర్నెల్లకోసారి..



ప్రతీ ఆర్నెల్లకోసారి పక్షులపై అవగాహన కల్పించే యోచన చేస్తున్నాం. ఎప్పటికప్పుడు పక్షుల రకాలను గుర్తించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వలంటీర్లగా నియమించాలని యోచిస్తున్నాం. అర్హులైన స్థానికులను నేచర్ గైడ్‌లుగా నియమిస్తాం. – శివ్‌ఆశిష్‌సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి, మంచిర్యాల

జిల్లాకు ఎయిర్‌పోర్ట్ తీసుకొస్తాం


మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, పక్కన ఎంపీ గోడం నగేష్

- ఎంపీ గోడం నగేష్

ఆదిలాబాద్: జిల్లాకు ఎయిర్ పోర్ట్ తప్పకుండా తీసుకువస్తామని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి మాట్లాడారు. ఇటీవల మాజీ మంత్రి జోగు రామన్న చేసిన వ్యాఖ్యలపై ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ నాయకులు అవగాహన రాహిత్యంతో అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఐదు సంవత్సరాలు మంత్రిగా ఉన్న జోగు రామన్న జిల్లా ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో ఎయిర్ ఫోర్స్ అకాడమీ ఏర్పాటు కోసం 2014లో తాను ఎంపీగా ఉన్న సమయంలో కృషి చేశానన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్థలం ఇవ్వని కారణంగానే ఎయిర్ పోర్ట్ అకాడమీ పెండింగ్‌లో ఉందన్నారు. ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్‌కు సంబంధించి 2011లోనే సర్వే జరిగిందన్నారు. ఇదే రైల్వే లైనుకు ఆర్మూర్–ఆదిలాబాద్ వయా నిర్మల్ కు జాయింట్ వెంచర్ అగ్రిమెంట్ చేసుకోవడానికి ఇద్దరు మంత్రులను కలిసినా పట్టించుకోలేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు వేద వ్యాస్, రఘుపతి, లాలా మున్నా, నగేష్, కృష్ణ, కరుణాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్


నాయకులతో సమీక్షిస్తున్న మీనాక్షి నటరాజన్

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేలా సమష్టిగా ముందుకు సాగాలని టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపూరావు, రేఖానాయక్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాసరెడ్డి, ఆడె గజేందర్, పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, తదితరులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులకు ఆమె స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అన్ని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేలా ఐక్యంగా పనిచేయాలన్నారు. ఎలాంటి విభేదాలకు తావులేకుండా పార్టీ పటిష్టత, స్థానిక సంస్థలన్నింటిలో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు.

మలేషియా జైలులో కడెం వాసులు


అధికారితో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

కడెం: మండలంలోని లింగాపూర్‌కు చెందిన రాచకొండ నరేష్, తలారి భాస్కర్, గురిజాల శంకర్, గురిజాల రాజేశ్వర్, గుండా శ్రీనివాస్, దస్తురాబాద్ మండలంలోని మున్యాల్ గ్రామానికి చెందిన యమునూరి రవీందర్ ఉపాధి నిమిత్తం గతేడాది మలేషియాకు వెళ్లారు. కొన్ని కారణాల వలన జైలులో ఉన్నారని కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ కలిసి విడుదల చేయించాలని వేడుకున్నారు. మలేషియా వెళ్లి ఉన్నతాధికారులను సంప్రదించాడు. అక్రమ ఆయుధ చట్టం కింద జైలులో ఉన్నారని తెలుసుకుని బాధితులను పరామర్శించాడు. విడుదల చేసేందుకు కృషి చేస్తానని భరోసా కల్పించాడు.

విద్యుత్ తీగలు అమర్చిన ఇద్దరి అరెస్టు

పెంచికల్‌పేట్: వన్యప్రాణులను వేటాడటానికి విద్యుత్ తీగలను అమర్చిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో అనిల్ కుమార్ తెలిపారు. కమ్మర్‌గాం గ్రామానికి చెందిన తలండి వెంకటేశ్, సిడాం అశోక్ వన్యప్రాణులను వేటడానికి పంట చేనులో విద్యుత్ తీగలను అమర్చరానే పక్కా సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి అదుపులో తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. నిందితులను ఇద్దరిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. వారి వెంట ఎఫ్ఎస్‌వో జగన్‌మోహన్, ఎఫ్‌బీవో విజయలక్ష్మీ, సిబ్బంది ఉన్నారు.

ఒకరిపై కేసు


అరెస్ట్ చూపుతున్న ఎస్సై మధుకర్

కౌటాల: మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన ఒకరిపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. వీరవెల్లి గ్రామానికి చెందిన కేద్మర్ నాగోరాం ఈ నెల 1న అదే గ్రామానికి చెందిన మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె ప్రతిఘటించడంతో తన కోరిక తీర్చకుంటే చంపేస్తానంటూ అక్కడే ఉన్న బకెట్‌తో దాడి చేయడంతో ఆమె ఎడమ కంటిపై గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'తుమ్మల'కు కవిసంధ్య పురస్కారం


తుమ్మల దేవరావు

నిర్మల్‌ఖిల్లా: ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కవిసంధ్య సాహితీ సంస్థ, నారాయణరావు ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి కవితా పోటీలలో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన కవి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు తుమ్మల దేవరావుకు కవిసంధ్య పురస్కారం దక్కింది. అతను రచించిన 'వరి గొలకులు' కవిత కన్సోలేషన్ బహుమతికి ఎంపికైనట్లు కవిసంధ్య సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈటశిఖామణి, దాట్ల దేవదానం రాజు తెలిపారు. ఈ నెల 23న హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియం లో అవార్డు అందుకోనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి (జి) గ్రామానికి చెందిన రాథోడ్ దినేష్ ఇల్లు బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దినేష్ తన ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు. ఈ క్రమంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో నుంచి పొగలు రావడంతో స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనలో ఇంట్లోని సామగ్రితో పాటు రూ.2 లక్షల 50 వేల నగదు, ఐదు గ్రాముల బంగారం కాలిపోయిందని బాధితుడు వాపోయాడు. సంఘటన స్థలాన్ని ఆర్ఐ సుమలత , పంచాయతీ కార్యదర్శి శివకుమార్ సందర్శించి పంచనామా నిర్వహించారు.

ముగ్గురిపై వీధికుక్కల దాడి

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో బుధవారం వీధి కుక్కలు దాడి చేయడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్న హర్ష అనే బాలుడిపై, కొట్రంగి చంద్రక్క, నాజర్‌పై క కుక్కలు దాడిచేసి గాయపరిచాయి. బాధితులను బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించారు.

కీచక ప్రధానోపాధ్యాయుడిపై కేసు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న ఓ కీచక ప్రధానోపాధ్యాయుడిపై కేసు నమోదైంది. రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల గిరిజన ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నైతం శ్రీనివాస్ రామకృష్ణాపూర్‌కు చెందిన ఓ ఉపాధ్యాయురాలిని తరచూ వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గతంలో విద్యార్థులను సైతం వేధింపులకు గురి చేసినట్లు ఘటనలు ఉన్నాయి. విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

గోదావరిలో నీట మునిగి వ్యక్తి మృతి


మారుతి (ఫైల్)

బాసర: నిర్మల్ జిల్లా బాసర గోదావరిలో నీటమునిగి ఒకరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మండలంలోని బీదరిల్లి గ్రామానికి చెందిన డోన్ గాలే మారుతి (34) కుటుంబ సభ్యులతో కలసి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌తో పాటు ఇతర పుణ్య క్షేత్రాలను దర్శించుకున్నాడు. తిరుగు ప్రయాణంలో బుధవారం బాసర గోదావరినదికి వచ్చారు. స్నానం చేస్తుండగా లోతు ఎక్కువగా ఉండడంతో నీటమునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

గోండుగూడ వద్ద మరొకరు..

కడెం: మండలంలోని చిట్యాల్ గోండుగూడకు చెందిన పందిరి జలపతి (56) గోదావరి నదిలో మునిగి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జలపతి ఈనెల 4న స్నానం చేయడానికి గోదావరి నదికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుని భార్య సీతాబాయి ఫిర్యాదు మేరకు బుధవా రం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

తాండూర్: ఈ నెల 2న రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం అచ్చులాపూర్ పంచాయతీ పరిధిలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన పెరుగు రాజయ్య (57) ఐబీ నుంచి నయారా పెట్రోల్‌బంక్ వద్దకు బైక్‌పై వెళ్తుండగా రేచినీ గ్రామానికి చెందిన భీంరావు ద్విచక్ర వాహనంపై ఎదురుగా వచ్చి ఢీ కొట్టాడు. ఘటనలో రాజయ్యకు తీవ్ర గాయాలు కావడంతో బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీంరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మహిళ..


లక్ష్మీబాయి (ఫైల్)

సోన్: చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మహిళ మృతి చెందిన సంఘటన నిర్మల్ జిల్లాలోని సోన్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సోన్ మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన లక్ష్మీబాయి (54) మంగళవారం సరస్వతీ కాలువలో చేపలు పట్టడానికి వెళ్లింది. చేపలు పడుతున్న క్రమంలో ఒడ్డు మీద నుంచి ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడిపోయింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం పోలీసులు మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ హైమద్ మోహినుద్దీన్ తెలిపారు.

మహారాష్ట్రలో ట్రాలీ బోల్తా..

- గుడిహత్నూర్ వాసులకు గాయాలు

గుడిహత్నూర్: మహారాష్ట్రలో ట్రాలీ వాహనం బోల్తా పడిన ఘటనలో మండలానికి చెందిన నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని గురుజ గ్రామానికి చెందిన జాదవ్ రాజు మంగళవారం 16 మంది బంధుమిత్రులతో కలిసి దైవ దర్శనానికి మహారాష్ట్రంలోని చంద్రపూర్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వీరు ప్రయాణిస్తున్న వాహనం కోర్పణ గ్రామ సమీపంలో బోల్తా కొట్టింది. దీంతో రాజుతో పాటు అతని తల్లి సీతాబాయి, మరో యువకుడు గెడం జగదీష్, నాందేడ్‌కు చెందిన మహిళ, రాజు మేన కోడలుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ముందుగా రిమ్స్ తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సీతాబాయిని హైదరాబాద్‌కు, అత్త, మేనకోడలిని నాందేడ్ తరలించి చికిత్స అందిస్తున్నారు. గెడం జగదీష్‌తో పాటు పలువురు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ అజాగ్రత్త వల్లనే ప్రమాదం జరిగిందని కోర్పణ పోలీసులు తెలిపారు.

121ప్రైవేటు డిగ్రీ కళాశాలల పరీక్ష ఫలితాలు నిలిపివేత

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని డిగ్రీ కోర్సుల మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను ఈ నెల 4న రాత్రి విడుదల చేసిన విషయం తెలిసిందే. కానీ డీన్ అకాడమిక్‌కు ఫీజులు చెల్లించని 121 ప్రైవేటు డిగ్రీ కళాశాలల ఫలితాలను నిలిపి వేశారు. ఇప్పటికే ఫీజులు చెల్లించాల్సి ఉండగా.. అప్పట్లో ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డిని, అప్పటి రిజిస్ట్రార్ మల్లారెడ్డిని కలిశారు. ప్రభుత్వం మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంటు ఇవ్వడం లేదని, కొంత సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. 15 నుంచి 20 రోజుల వరకు సమయం ఇచ్చారు. పరీక్షలు పూర్తయ్యాక యూనివర్సిటీ అకాడమిక్ డీన్ ఆయా కళాశాలలకు ఫీజులు చెల్లించాలని నోటీసులు పంపారు. బుధవారం వరకు 121 ప్రైవేటు కళాశాలలు ఫీజులు చెల్లించలేదు. ఫీజులు చెల్లించిన కళాశాలల ఫలితాలు వెబ్‌సైట్‌లో ఉంచి చెల్లించని వారివి నిలిపివేశారు. తమ ఫలితాలు చూసుకునే వీలులేకపోవడంతో ఆయా కళాశాలల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఫీజులు చెల్లించినట్లు క్లియరెన్స్ వస్తేనే ఫలితాలు వెల్లడిస్తామని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ స్పష్టం చేశారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి


విలాస్ (ఫైల్)

సిరికొండ: విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తుమ్మల్‌పాడ్ గ్రామానికి చెందిన ఇంగోలే నాగోరావ్, కుసుంబాయి దంపతుల రెండో కుమారుడు ఇంగోలే విలాస్ (24)బుధవారం ఇంటి మరమ్మతు పనులు చేస్తుండగా విద్యుత్ వైరుకు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. కేకలు వేయడంతో స్థానికులు వచ్చి ఇచ్చోడ ఆస్పత్రికి తరలించేలోగానే మృతి చెందాడు. మృతుడు ఆరునెలల క్రితమే దుబాయ్ నుంచి ఇంటికి వచ్చాడని గ్రామస్తులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

నెన్నెల: గత నెల 28న మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ప్రసాద్ తెలి పారు. బెల్లంపల్లి మండలం ఆకెనపల్లికి చెందిన తోకల రాజేశం (34) అత్తగారి ఊరైన నెన్నెల మండలం మైలారంలో ఉంటున్నాడు. ఫిబ్రవరి 28న మద్యం మత్తులో పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుని సోదరుడు తోకల సుదర్శన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం


కొమురయ్య (ఫైల్)

లక్సెట్టిపేట: గత నెల 27న ఓమన్‌లో మృతి చెందిన వలస కూలీ మృతదేహం బుధవారం స్వగ్రామం చేరుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని హన్మంతుపల్లి గ్రామానికి చెందిన గుమ్ముల కొమురయ్య (48) ఉపాధి నిమిత్తం రెండేళ్లక్రితం ఓమన్ దేశానికి వెళ్లి అక్కడ భవన నిర్మాణ రంగంలో కూలీగా పనిచేస్తున్నాడు. నిర్మాణంలో ఉన్న భవనం మూడో అంతస్తులో పనిచేస్తుండగా అదుపుతప్పి కిందపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. బుధవారం మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడంతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వృద్ధుడు ఆత్మహత్య

దండేపల్లి: గడ్డిమందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసినొద్దీన్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని వెల్గనూర్‌కు చెందిన అక్కల మల్లేశం (79) కొన్నేళ్ల క్రితం భార్య, ఇద్దరు కుమారులను కోల్పోయాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెందడంతో ఈనెల 4న గడ్డిమందు తాగి వాంతులు చేసుకోవడంతో గమనించిన స్థానికులు లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు రెఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని కుమార్తె రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అధికారి ఇంట్లో చోరీకి యత్నం

భైంసాటౌన్: పట్టణంలోని సాయికాటన్ ఏరియాలో ఉంటున్న ఆర్అండ్‌బీ డీఈఈ సునీల్ ఇంట్లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. సాయికాటన్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న భైంసా ఆర్అండ్‌బీ డీఈఈ సునీల్ మంగళవారం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. బుధవారం ఇంటి తాళం తెరిచి ఉండడం గమనించిన స్థానికుల సమాచారంతో అతను వచ్చి పరిశీలించగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఇంట్లో విలువైన వస్తువులు, నగదు లేవని చెప్పారు.

అడవి పందుల దాడిలో ఇద్దరికి గాయాలు

పెంబి: మండలంలోని సక్కిగూడ గ్రామానికి చెందిన సిడాం లక్ష్మణ్, సిడాం తుకారాం మంగళవారం రాత్రి షెట్‌పల్లి సమీపంలో ఉన్న చేనుకు కాపలాగా వెళ్తుండగా అడవి పందులు దాడి చేయడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.